# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JUNE - 2016

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6:00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2:30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3:30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్ష్మీ గూటం |
| | | రోనీ గూటం |

youtube లో satyavanichurchofchrist.com

పై కార్యక్రమములను చూడండి.

మీ బంధు మిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O. BOX. 80, KAKINADA**

**PIN : 533004, Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box-80, Kakinada, A.P. 533 004**
**Ph : 0884 - 2363722, 98489 98547**

Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి-36** **జూన్ - 2016** **సంచిక 11**


## క్రైస్తవుని పెరుగుదల
### *(Christian Growth)*

అపో. పేతురు వ్రాసిన రెండవ పత్రికలో తన్ను తాను ఇట్లు పరిచయము చేసికొనెను. "యేసుక్రీస్తు దాసుడును అపొస్తలుడునైన సీమోను పేతురు, మన దేవునియొక్కయు రక్షకుడైన యైసుక్రీస్తు యొక్కయు నీతినిబట్టి, మావలెనే అమూల్యమైన విశ్వాసము పొందినవారికి శుభమని చెప్పి వ్రాయునది". యేసుక్రీస్తు దాసుడను అని పరిగణింపబడుట పేతురు ఘనముగా ఎంచుకొనెను. దేవుని దాసుడను బిరుదుకంటె ఘనమైనదేదియు నిజానికి లేనేలేదు. క్రైస్తవులందరికి యున్న అమూల్యమైన విశ్వాసమును గూర్చి అతడు వారికి జ్ఞాపకము చేసెను. ఈ అమూల్యమైన విశ్వానము ప్రఖ్యాతిగాంచిన అపొస్తలునికే కాదు గాని సామాన్య విశ్వాసికి కూడ అనుగ్రహింపబడెను. అర్హుడు కాకపోయినను ఈ విశ్వాసము దేవుని కృపవలన మానవునికి అనుగ్రహింపబవడెను. దేవుడు నీతిమంతుడు గనుక ఆయన అందరిని సమానముగ దీవించును.

"దేవునిగూర్చినట్టియు, మన ప్రభువైన యేసును గూర్చినట్టియు నైన అనుభవ జ్ఞానమువలన మీకు కృపయు సమాధానమును విస్తరించునుగాక" యని అతడు వ్రాసెను. ఈ అనుభవ

జ్ఞానముద్వారా కృప విస్తరించును. అది సమాధానమునకు స్థావరము. క్రీస్తునందున్న దీవెనలను, రక్షణను పొందుటకు అది ఒక పరికరము. క్రైస్తవుని పెరుగుదలకు దేవుని చిత్తము నెరగి దానిని ధ్యానించుట అత్యవసరము. అందువలననే అబద్ధ బోధకులను గూర్చి పేతురు క్రైస్తవులను హెచ్చరించెను. సత్యము మాత్రమే మానవుల ఆత్మలను రక్షించగలదు.

దేవుని వర్తమానము బైబిలు ద్వారా బయలుపరచబడి యున్నది. "ఆయన దైవశక్తి జీవమునకును, భక్తికిని కావలసిన వాటన్నిటిని మనకు దయచేసెను" అని పేతురు వ్రాసెను. మానవుని సమస్తావసరములను తీర్చుటకు దేవుని వాక్యము సంపూర్ణమై యున్నదని ఈవచనము బోధించుచున్నది. మానవుని ప్రతి ఆత్మీయావసరము లేఖనములలో తీర్చబడియున్నది. బైబిలు మార్పు చేయబడనక్కరలేదు గాని మానవులు దానిని చదివి, దానికి లోబడవలసియున్నది. మనలను పిలిచినవాని గూర్చిన అనుభవ జ్ఞానము కలిగియుండవలెనని పేతురు చెప్పుచున్నాడు. అంటే క్రీస్తును గూర్చిన జ్ఞానములో పెరుగుట, దినదినము బలపడుటయని యర్ధము. క్రీస్తుయొక్క శిష్యుడు ప్రతిదినము దేవుని వాక్యమును చదివి నేర్చుకొనుచుండవలెను. అతనికి చేయబడిన వాగ్దానములు, క్షమాపణ, శాంతి, సమాధానము, నిత్య జీవ నిరీక్షణ మొదలగునవన్నియు ప్రశస్తమైనవి.

యెహోవా దేవుని సంతోష పెట్టుటకు క్రైస్తవుడు ఆత్మీయముగా పెరుగవలెను. దేవుని యొక్క కృపలో అతడు పెరుగుట అతి ప్రాముఖ్యమైనది. ఆరోగ్యకరమైన జీవితమునకు అభివృద్ధి అత్యవసరము. పెరుగుదల లేనియెడల జీవరాసులు నాశనమగును.

క్రైస్తవులు ఆత్మీయముగా పెరుగవలసినదని పేతురు హెచ్చరించుచున్నాడు. ఆత్మీయ నిధులను వినియోగించుట ద్వారా వారు విశ్వాసమునందు బలిష్టులుగా తయారు కాగలరు. అతడిట్లనుచున్నాడు : "ఆ హేతువు చేతనే మీమట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త

గలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును జ్ఞానమునందు ఆశా నిగ్రహమును, ఆశానిగ్రహము నందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి" (2 పేతురు 1:5-7).

క్రైస్తవులు ఆత్మీయముగా పెరుగుటకు సద్గుణము కలిగియుండ వలెనని పేతురు హెచ్చరించెను. సద్గుణము పురుష లక్షణము. సద్గుణమనగా మానసిక బలము, జ్ఞానము, ధైర్యము, పట్టుదల, శక్తియని రోమీయులు తలంచిరి. క్రైస్తవులు అమర్చుకొనవలసిన ఎనిమిది లక్షణములను గూర్చి పేతురు వ్రాసెను. ఈ ఎనిమిది గుణములు ఒకదానిపై మరొకటి ఆధారపడి అభివృద్ధి చెందవలసియున్నది.

క్రైస్తవులు జ్ఞానములో అభివృద్ధిజెందవలెను. దేవుడు తన ప్రజలనుండి ఏమికోరుచున్నాడో దానినెరుగుట జ్ఞానము. ఈ జ్ఞానము వలన ఒకడు మంచి చెడులను విచక్షణ చేయుగలడు. ఈ జ్ఞానమునకు ఆశానిగ్రహమును క్రైస్తవులు కలుపవలసియున్నది. ఆశానిగ్రహము కలిగియుండుటనగా తన్నుతాను అదుపులో యుంచుకొనుట. ఆశానిగ్రహము ఆత్మశిక్షణను, క్రమశిక్షణను, నిగ్రహ బుద్ధిని సూచించుచున్నది. తన్నుతాను నిగ్రహించుకొనలేనివాడు దేవుని చిత్తమును నెరవేర్చలేడు.

ఆశానిగ్రహము నుండి సహనము అభివృద్ధియగును. ఈ జీవిత శోధనలు, బాధలు వచ్చినను ఓరిమితో సహించిన భక్తుడైన యోబు మనకు గొప్ప మాదిరిగా బైబిలునందు కన్పడు చున్నాడు. సహనము కలిగినవాడు అన్ని పరిస్థితులలోను ప్రశాంతముగా కన్పడును. యేసు ప్రభువు సిలువ మరణమును మన నిమిత్తమై సహించెను.

సహనమునందు క్రైస్తవుడు భక్తిని అమర్చుకొనవలెను. దేవునియెడల అతడు వినయముతో కూడిన భయమును, భక్తిని కలిగియుండ వలెను. దేవుని స్వభావమందు

పాలివాడగుటకు క్రైస్తవుడు భక్తికలిగి యుండవలెను. భక్తి కలిగియుండుట లౌకిక స్వభావముకు ఖచ్చితముగా వ్యతిరేకమైనది. ఎవరు నిజముగా భయంభక్తులు కలిగియుందురో అట్టివారు దేవస్వభావమునందు పాలివారగుదురు. భక్తియందు క్రైస్తవులు సహోదర ప్రేమను అమర్చుకొనవలెను. మానవుడు దేవుని స్వరూపము చొప్పున చేయబడెను. దేవుడు ప్రేమయై యున్నాడు. దేవుడు మన తండ్రియై యుండగా ఆయన బిడ్డలు మన సహోదరులు. వారిని ప్రేమించుటయే మన విధి. "యేసు క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టియున్నాడు. పుట్టించినవానిని ప్రేమించు ప్రతి వాడును ఆయన మూలముగా పుట్టినవానిని ప్రేమించును" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1యోహాను 5:1,2) తన సహోదరుని ప్రేమించనివాడు దేవుని ప్రేమించలేడు. "ఎవడైనను - నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు" అని 1 యోహాను 4:20లో వ్రాయబడి యున్నది.

క్రైస్తవుడు సహోదరులయెడల ప్రేమను కలిగి యుండుట అత్యవసరము. అన్నిటికంటె శ్రేష్ఠమైనది ప్రేమయే, "వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొనుడి'' యని కూడ అపో.పౌలు కొలస్స 3:14లో హెచ్చరించెను. సహోదర ప్రేమ యందు క్రైస్తవులు దయను కూడ అమర్చుకొనవలెను. "ఇవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును'' అని అపో. పేతురు చెప్పుచున్నాడు.

క్రైస్తవుని కుండవలసిన ఈ లక్షణములను మనము రెండు విధములుగా చూడవచ్చును. 1) క్రైస్తవ జీవితమునకు ప్రవర్తనకు అవుసరమయిన లక్షణములు, అనగా

సద్గుణము, జ్ఞానము. ఆశానిగ్రహము, సహనము అనునవి. 2) క్రీస్తు శిష్యుడు దేవుని దాసుడని బయలుపరచుట కవుసరమైన లక్షణములు, అనగా భక్తి సహోదర ప్రేమ, దయ మొదలగునవి. ఈ లక్షణములలో ఓ ఒకటియు దానికదే నిలువలేదు. అది మరొక దానిపై ఆధారపడియున్నది. ఈ క్రైస్తవ లక్షణములు లేకుండ ఒకడు క్రైస్తవ జీవితమును జీవించలేడు. ఈ దైవ లక్షణములు కలిగియున్న ప్రతి క్రైస్తవుని జీవితము ధన్యమైనది, ఫలవంతమైనది యగును. "అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. అలాగున మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా కలుగును" అని పేతురు చెప్పుచున్నాడు (2 పేతురు 1:10, 11).

దేవుడు మనలను క్రీస్తు సువార్త ద్వారా పిలిచి ఏర్పాటు చేసుకొనును. ఎవరు నిత్య జీవమును వెదుకుదురో అట్టివారిని ఆయన ఏర్పాటు చేసికొనును. క్రీస్తునందు విశ్వసించి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది మరణ పర్యంతము నమ్మకముగా యున్నవారికి ఆయన నిత్యరాజ్యములో ప్రవేశము కలుగజేయును. నీవు దేవుని నిత్యరాజ్యములో ప్రవేశింప గోరుచున్నావా?

# యేసుక్రీస్తు యొక్క దైవత్వము

**(The Deity of Jesus Christ)** (కొలస్స 2:8-10)

**పరిచయము :**

ప్రతివాడు నేడు బైబిలు ముఖ్యమని భావిస్తాడు. అది దేవుని సర్వ సంపూర్ణబయల్పాటు; దోష రహిత వాక్యము.

అందువలన క్రైస్తవుడు

**1. యేసుక్రీస్తు దేవుడై యున్నారు. ఆయన దేవుని యొక్క తత్వమును లక్షణములను కలిగియున్నారు. గనుక ఆయన దేవుడు.**

మర్త్యతకును అమర్త్యతకును, దైవత్వముకును మానవత్వముకును గల వ్యత్యాసమును తెలిసికొన గలడు.

యేసుక్రీస్తు యొక్క దైవత్వమును నిరూపించుటకు బైబిలు యొక్క సాక్ష్యము చాలును.

**2. యేసు ప్రభువు యొక్క దైవత్వమును బహుశ అందరు ఒప్పుకొంటారు. గనుక ఈ అంశమును ధ్యానించుటవలన యేసు ప్రభువునందు విశ్వాసముంచువారు బలపరచబడుదురు.**

కొన్ని మతములవారు క్రీస్తుయొక్క దైవత్వమును నిరాకరించుదురు (యెహోవా సాక్షులు, ముస్లిములు, బౌద్ధులు మొ॥వారు).

**3. ఒక్కోసారి కొన్ని పదజాలముల వలన ప్రజలు గజిబిజి యగుదురు.**

దేవుడు, దైవత్వము అను పదములు సరిసమానములు.

దైవత్వములోని ముగ్గురు మూర్తులలో యేసుక్రీస్తు ఒకరు. అందువలన తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మ దేవుడు అని సంబోధిస్తాము (మత్తయి 28:18-20; 3:16-17; ఎఫెసీ 4:4-6).

గనుక బైబిలులో కనబడని త్రిత్వము అను పదము బైబిలు వ్యతిరేకమైనది కాదు. అది దైవత్వములోని ముగ్గురు వ్యక్తులను సూచించుటకు సాధారణంగా వాడబడుచున్న పదము.

**I. మెస్సీయను గూర్చిన ప్రవచనములు వాటినెరవేర్పు యేసు దేవుడని నిరూపించుచున్నవి.**

దావీదు సంతతిలో నుండి బలవంతుడగు దేవుడుద్భవించునని ప్రవచింపబడినది (యెషయా 9:6-7).

అవి నెరవేర్చబడినట్లు సువార్తల లోని రికార్డు మనకు ధృవీకరించు చున్నది. ఆ ప్రవచనము లన్నియు నజరేయుడైన యేసులో నెరవేరెను (మత్తయి 1:23; లూకా 1:31-33).

అది నెరవేరక 700 సంవత్సరాల ముందు యెషయా ప్రవచించెను.

**II. యేసు శరీరధారుడు కాక ముందున్న జీవితం యేసు దేవుడని నిరూపించుచున్నది.**

అబ్రహాముకు ముందు నుండే ఆయన యున్నట్లు యేసు తన్ను గూర్చి చెప్పుకొనెను (యోహాను 8:58).

యేసు సృష్టి జరుగక ముందు నుండి యుండెను. మరియు సృష్టి నంతటిని తన మాట చేత నేటికిని నిర్వహించుచున్నారు (కొలస్స 1:14-17; యోహాను 1:1-3, 14; ఆదికా 1:26).

దేవునిచే ఏర్పాటు చేయబడిన సమయమందు దేవునిలో రెండవ వ్యక్తియైన యేసు మానవావతారియై ఈ లోకమునకు వచ్చెను (గలతి 4:4).

**III. తాను దేవుడనని యేసు చెప్పుకొనెను :**

తానుదేవుడనని యేసుక్రీస్తు పలు సందర్భాలలో చెప్పుకొనెను.

1. మొదటి శతాబ్ధపు యూదా మత నాయకులు ఆయన తన్ను దేవునితో సమానునిగా చేసికొను చున్నాడని భావించిరి (యోహాను 6:17-18).

2. తాను దేవుడనని యేసు సమరయ స్త్రీతో విపులముగా చెప్పుకొనెను (యోహాను 4:24-26).

3. అదే రీతిగా యేసు యూదుల సమాజమందిరపు అధికారుల యెదుట తాను దేవుని కుమారుడని, గనుక దేవుడనని చెప్పుకొనెను (మార్కు 14:61-62).

బి. యేసు దేవుని మంచి ప్రవక్తయై యుండియు, దేవుని కుమారుడుగా ఉండకుండ యుండలేరు.

1. యేసు దేవుని కుమారుడు గనుక దేవుడనని తన్ను గూర్చి చెప్పుకొనెను.

2. గనుక ఆయన తన్ను గూర్చి చెప్పుకొనినదేదో సత్యమై యుండాలి లేదా మోసగాడైయుండాలి.

యితరులిచ్చిన సాక్ష్యములు యేసు దేవుడని నిరూపించు చున్నవి.

1. యేసు యొక్క శత్రువులు ఆయన దేవుడని ఒప్పుకొన్నారు. యేసు యొక్క శత్రువుల సాక్ష్యము బలమైనది.

2. యేసును అప్పగించిన యూదా ఆయన నిర్దోషియని ఒప్పుకొనెను (మత్తయి 27:3-5).

పిలాతు ఆయన యందు ఏ దోషమును కనుగొనలేకపోయెను (యోహాను 18:33-38).

3. సిలువ యొద్ద కాపలా యున్న శతాధిపతి ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొనెను (మత్తయి 27:54).

4. నజరేయుడైన యేసు దేవుని కుమారుడని దయ్యములు సయితము ఒప్పుకొనెను (లూకా 4:34).

**యేసు యొక్క మిత్రులు సయితము ఆయన దేవుడని ఒప్పుకొన్నారు.**

1. నజరేయుడైన యేసు దేవుడని బాప్తిస్మమిచ్చు యోహాను ఒప్పుకొనెను (యోహాను 1:29, 34).

2. అపొ. యోహాను తాను దేవుడనని యేసు చెప్పుకొనిన మాటలను వ్రాసెను (ప్రక 1:8).

3. యేసే క్రీస్తని, దేవుడని అపొ. పేతురు ఉద్ఘాటించెను (మత్తయి 16:16).

4. అపొ.తోమా యేసును నా దేవా, నా ప్రభువా అనిపిలిచెను (యోహాను 2:28).

5. దమస్కుమార్గములో అపొ. పౌలు యేసు దేవుడని ఉద్ఘాటించెను (అపొ కా 22:6-10). తరువాత కూడ ఆయన దేవుడని ప్రకటించెను (ఫిలిప్పీ 2:5-11).

6. యేసు క్రీస్తు గనుక దేవుడని దేవదూతలు ప్రకటించెను (లూకా 2:10-11).

7. తండ్రియైన దేవుడు యేసు దేవుని కుమారుడని ప్రకటించెను (మత్తయి 3:17; 17:5).

8. ప్రవక్తయైన సుమెయోను యేసు దేవుడని ఒప్పుకొనెను (లూకా 2:25-32)

9. ప్రవక్త్రియైన హన్నా యేసు దేవుడని ప్రకటించెను (లూకా 2:36-38).

**పాత నిబంధనలో యెహోవా దేవుడు అను పదము దైవత్వములోని రెండవ వ్యక్తికి కూడ వర్తించును. అది యేసుకును వర్తించును.**

1. యెహోవా సృష్టికర్త (యెషయా 40:28; యోహాను 1:3)

2. యెహోవా రక్షణ కర్త. యెషయా 43:11; యోహాను 4:42

3. యెహోవా మృతులను లేపును. 1 సమూ 2:6; యోహాను 5:21

4. యెహోవా గొప్ప

న్యాయాధిపతి. యోవేలు 3:11-12; యోహాను 5:27; మత్తయి 25:31-33.

5. యెహోవా నిత్య వెలుగై యున్నారు. యెషయా 60:19-20; యోహాను 8:12.

6. యెహోవా ఎల్లప్పుడు ఉన్నవాడైయున్నారు. నిర్గమ 3:14-15; యోహాను 8:58.

7. యెహోవా గొప్ప కాపరి. కీర్తన 23:1; యోహాను 10:11.

8. యెహోవా దేవుని మహిమయై యున్నారు. యెషయా 42:8; యోహాను 17:1,5

9. యెహోవా ఆదియు అంతము నైయున్నారు. యెషయా 41:4; 44:1; ప్రకటన 1:17, 2:88.

10. యెహోవా విమోచకుడు. హోషేయ 13:4;14; గలతీ 4:5; ఎఫెసీ 1:7; తీతు 2:14.

11. యెహోవా పెండ్లి కుమారుడు. యెషయా 62:3-5; హోషెయ 2:16-19; మత్తయి 25:1-13; ప్రక 21:2.

12. యెహోవా శైలము (బండయై) యున్నారు. కీర్తన 18:2; 1 కొరింథీ 10:4

13. యెహోవా పాపములను క్షమించును (యిర్మియా 31:34; మార్కు 2:7,10).

14. యెహోవా దూతలచే ఆరాధింపబడెను. కీర్తన 148:1-2; హెబ్రీ 1:6

15. యెహోవాఆకాశమందు నివసించును, మనుష్యులు ఆయనకు విజ్ఞాపన చేతురు. అపో.కా 7:59

16. యెహోవా దూతలను సృజించెను. కీర్తన 148:2,5; కొలస్స 1:16.

17. యెహోవాను ప్రభువని ఒప్పుకొనవలెను. యెషయా 45:21-23; ఫిలిప్పీ 2:11.

**యేసు యొక్క పునరుత్థానము ఆయన దేవుడని నిరూపించుచున్నది.**

ఎ. మృతులలోనుండి లేచిన వారిలో యేసుక్రీస్తు ప్రధముడు గాని ఆఖరివాడుగాని కాదు.

1. సారెపతు విధవరాలి

కుమారుడు చనిపోయినను మరల బ్రతికించబడెను (1 రాజులు 17:22).

2. షూనేమిరాలు యొక్క కుమారుడు చనిపోయెను గాని మరల బ్రతికింపబడెను (2 రాజులు 4:35).

3. ఎలీషాయొక్క శల్యము తగులగానే చనిపోయిన వాడు తిరిగి లేచెను (2 రాజులు 13:21).

4. యాయీరు కుమార్తె మృతుల నుండి తిరిగి లేపబడెను (మత్తయి 9:18-25; మార్కు 5:22-43).

5. నాయీను విధవరాలి కుమారుడు చనిపోయినను తిరిగి బ్రతికింపబడెను (లూకా 7:11-15).

6. చనిపోయి, సమాధిలో యుంచబడిన లాజరు మరల బ్రతికింపబడెను (యోహాను 11:44).

7. చనిపోయిన దొర్కాను అపొ.పేతురు తిరిగి లేపెను (అపొకా 9:30-41).

**అయితే వీరందరు మరల చనిపోయి సమాధిలో చేరుకొనిరి. యేసు క్రీస్తు మృతులలోనుండి తిరిగి లేచినను మరల ఎన్నటికి చనిపోలేదు!**

బి. మరెన్నటికిని చనిపోవక యుండుటకు, లేపబడిన వారిలో యేసు క్రీస్తు ప్రథముడు (1 కొరింధి 15:20,22).

తన స్వకీయ మరణముగూర్చి యేసుక్రీస్తు ముందుగనే ప్రవచించారు (మత్తయి 16:21, మార్కు 9:9).

యేసు యొక్క పునరుత్థానమును దూతలు ప్రకటించిరి (మత్తయి 1-6; మార్కు 16:1-7; లూకా 24:1-9; యోహాను 20:12).

పునరుత్థానుడైన యేసును వందలాదిమంది చూచిరి (అపొ.కా 3:14-15).

మగ్దలేనే మరియ - యోహాను (20:1-18; మార్కు 16:9).

మరియ అనే వేరొక శిష్యురాలు, మత్త 28:9-10.

ఇద్దరు శిష్యులు (లూకా 24:13-31).

అపొ. పేతురు, లూకా 24:34.

తోమా తప్ప మిగతా పదిమంది అపొస్తులులు (యోహాను 20:19-24).

తోమా మరియు కొందరు శిష్యులు. యోహాను 20:26-28.

500 మంది కంటె ఎక్కువ సహోదరులు. 1 కొరింథీ 15:6.

అపొ. పేతురు. 1 కొరింథి 15:8; అపొకా. 9:3-8; 22:6-11.

పునరుత్థానుడైన మన ప్రభువైన యేసు పరమందు తండ్రియొక్క కుడి పార్శ్వమున ఆశీనుడైయున్నారు. ఎఫెసీ 1:20.

**VII. యేసు కన్యగర్భమున జన్మించుట ఆయన దేవుడని నిర్ధారించుచున్నది.**

ఎ. కన్యక జననమిచ్చునని ప్రవచింపబడెను. యెషయా 7:14.

బి. కన్య గర్భమున జన్మించునని చెప్పబడిన ప్రవచనము నజరేయుడైన యేసులో నెరవేరెను. మత్తయి 1:23.

సి. దేవునికి అనుకూలమగు సమయమందు కన్యగర్భములో జన్మించుట సంకల్పించబడెను. గలతీ 4:4

**VIII. యేసుయొక్క పరిపూర్ణ పాప రహిత జీవితం ఆయన దేవుడని నిరూపించుచున్నది.**

ఎ. యేసు ఏ పాపము చేయలేదు. హెబ్రీ 4:15; 1 పేతురు 2:22

బి. ఆయన నిరపరాధియని ప్రభువుయొక్క శత్రువులు సయితము ఒప్పుకొన్నారు. లూకా 23:4.

**IX. తండ్రితో ఏకీభావము కలిగి యుండుట ఆయన దైవత్వమును రూఢి పరచుచున్నది.**

ఎ. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు దైవత్వములోని వ్యక్తులు (మత్తయి 28:18-20).

బి. తండ్రి, కుమారులు ఏకమైయున్నారు. యోహాను 10:30; 14:9; 17:21.

**X. ప్రకృతి కతీతమైన క్రీస్తు జ్ఞానము ఆయన దైవత్వమును నిరూపించుచున్నది.**

ఎ. యేసు యొక్క జ్ఞానము ప్రకృతి కతీతమైనది. యోహాను 14:47-49; 2:24-25; 4:28-29.

బి. యితరులు కూడ దేవుడు వారికిచ్చుటవలన ఇట్టి జ్ఞానము కలిగి యుండిరి. దానిని దేవుడే వారికిచ్చెను. అపొకా 9:10-17; 21:10-11.

సి. ప్రకృతి కతీతమైన జ్ఞానము కలిగియుండి, తాను దేవుడనని వక్కాణించుట వలన క్రీస్తుయొక్క దైవత్వము రూఢి పరచబడియున్నది.

**XI. యేసు చేసిన అద్భుతములు ఆయన దేవుడని నిరూపించుచున్నవి.**

ఎ. యేసు అనేక అద్భుతములు చేసెను. యోహాను 3:2, 5:36.

బి. అద్భుతాలు చేసే శక్తి యితరులకు కూడ ఇయ్యబడెను. అపొ.కా. 2:4; 3:4-8.

సి. అద్భుతశక్తిని కలిగియుండి తాను దేవుడనని వక్కాణించుకొనుట వలన యేసుయొక్క దైవత్వము నిరూపణ యగుచున్నది. యోహాను 20:30-31.

**ముగింపు :**

యేసు దేవుడని బైబిలు పదే పదే వక్కాణించుచున్నది.

మానవాతారియైన యేసుక్రీస్తు దేవుడైయుండియు ఈ పుడమిపై సంచరించుచు మన కొరకు చనిపోయి సమాధి చేయబడి మృతులలో నుండి తిరిగి లేచారు.

ఆయన తనకు విధేయులైన వారందరికి రక్షకుడు. హెబ్రీ 5:6-9.

ఆయనను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. మార్కు 16:16.

- లూయిస్ రష్మోర్

## దేవుని వలన పుట్టినవాడు

**(Him who is begotten of Him)**

"యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టి యున్నాడు. పుట్టించిన వానిని ప్రేమించు ప్రతివాడును ఆయన మూలముగా పుట్టిన వానిని ప్రేమించును. మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చు వారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని దాని వలననే యెరుగుదుము. మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు. దేవుని మూలముగా పుట్టినవారందరును లోకమును

జయించుదురు, లోకమును జయించిన విజయము మన విశ్వాసమే. యేసు దేవుని కుమారుడని నమ్ముమవాడు తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు?" (1 యోహాను 1:1-5).

యోహాను వ్రాసిన మొదటి పత్రికలో "దేవుని మూలముగా పుట్టినవాడు" అను మాటను 7 సార్లు అతడు వినియోగించాడు. దేవుని మూలముగా పుట్టినవాడనగా తిరిగి జన్మించిన వాడని యర్థము. నీకోదేముతో మాట్లాడుచు యేసు ఆ పదమును వినియోగించెను. ఆ సంభాషణలో శారీరక జన్మకును ఆత్మీయముగా తిరిగి జన్మించుటకును గల వ్యత్యాసమును గూర్చి యేసు అతనికి తెలియజెప్పెను. తిరిగి జన్మించుట యనగా నిజ క్రైస్తవునిగా మారుట. ఒకడు ఎట్లు తిరిగి జన్మించగలడో యేసు నీకొదేముకు వివరించారు (యోహాను 3:3-5). మనము ఆత్మమూలముగను నీటి మూలముగను తిరిగి జన్మించాలి. నీటిమూలముగా అనగా బాప్తిస్మము ద్వారా తిరిగి జన్మించాలి. దేవుని యొక్క శక్తి వలన వాక్యము ద్వారా ఈ నూతన జన్మ సంభవించును. అది భౌతిక జన్మ కాదు.

తదుపరి నిజక్రైస్తవుని యొక్క లక్షణములను గూర్చి యోహాను తన పత్రికలో తెలియజేసాడు. క్రైస్తవుడు కనుబరచవలసిన మూడు లక్షణములను గూర్చి అతడు వ్రాసాడు. పవిత్ర జీవితము, ప్రేమ గల జీవితము మరియు యేసే క్రీస్తని నమ్ము జీవితము. నిజ క్రైస్తవునికి యివి ఒక్కొక్కటి చాలా ప్రాముఖ్యము. నిజానికి ఈ మూడు కలిసే యుంటాయి.

మొదటిగా క్రైస్తవుడు యేసే క్రీస్తని నమ్ముతాడు. క్రీస్తు అనగా దేవుని అభిషిక్తుడు అని యర్థము. దేవుడు యేసును రాజుగాను యాజకుని గాను అభిషేకించెను. రాజు అనగా అధికారమును, ఆధిపత్యమును సూచించును. యాజకుడు అను మాటలో బలియాగమును, మధ్యవర్తిత్వమును సూచించబడు చున్నవి. మనము తిరిగి

జన్మించాలంటే యేసునందు విశ్వాసముంచుటయే గాక ఆయనే క్రీస్తని కూడ నమ్మవలెను.

ఆదిమ క్రైస్తవ సంఘములో యున్న అబద్ధబోధ యేమంటే ఆయన దేవుడే గాని మానవుడు కాదనునది. ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడెను గాని నిజముగా మనుష్యుడు కాదు. అబ్రాహాముకు కనబడిన దూతల వలె ఆయన మనుష్యునిగా కనబడెను అనే అబద్ధ బోధ ప్రబలి యుండెను. అందుకే యోహాను యేసు శరీరధారియై వచ్చెనను వాస్తవమును వక్కాణించెను (1 యోహాను 4:2). నేడు యేసును గూర్చి అటు యిటు నమ్మువారు మన మధ్యవున్నారు. కొందరు యేసు దేవుడు కాదంటారు, మరికొందరు ఆయన మానవుడు కాదంటారు; అయితే ఆయన ఈ రెండు అయియున్నారని మనము నమ్మాలి. ఆయన శరీరము ధరించిన, ఆది నుండి వాక్యమైయున్న దేవుడు. ఆయన దేవుడు, మానవుడు కూడాను, దేవుని కుమారుడు!

క్రీస్తనబడిన యేసు దేవుని కుమారుడని మనము నమ్మవలెనని బైబిలు చెప్పుచున్నను క్రైస్తవులన బడేవారు నమ్మకయున్నారు. యేసును గూర్చిన ప్రాధమిక సత్యములను వారు కాదంటారు. వారు ఆయన కన్య గర్భమున పుట్టలేదంటారు. బైబిలులో యున్న ఆయన చేసిన అద్భుతములను నిరాకరిస్తారు. ఆయన గొప్ప పనులు చేసారని అంగీకరిస్తారు గాని సువార్తలలో యున్న అద్భుతములు కాదంటారు. వారిలో అనేకులు ఆయన పునరుత్థానమును నిరాకరిస్తారు. ఇన్ని సంగతులు వారు కాదన్నా తాము క్రైస్తవములమే యని చెప్పుకుంటారు. యిదంతా వారి భ్రమయే యని యోహాను విపులీకరిస్తాడు. ఆయన ఒక గొప్ప బోధకుడని నమ్ముటయే కాదు ఆయన దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసించాలి. అంటే ఆయన దేవుడని నమ్మాలి (యోహాను 5:18). దేవుడు మనవలె శరీరధారియాయెనని మనము నమ్మవలెను. ఈ వాస్తవములను ఒకడు నమ్ముటకు నిరాకరిస్తే అతడు దేవుని వలన పుట్టిన వాడు కాదు, క్రైస్తవుడు కాదు.

రెండవదిగా క్రీస్తునందలి విశ్వాసము యొక్క సహజ పరిణామము యేమంటే మన సహోదరుల యెడ నిజమైన ప్రేమను కలిగి యుండాలి. క్రొత్త జన్మ వలన దేవుని బిడ్డలతో ప్రేమ పూర్వక సంబంధమేర్పడును. దేవుని పిల్లలను ప్రేమించకుండా దేవుని మనము ప్రేమించలేము. వారు మన సహోదరులు. నిజానికి మన సహోదర ప్రేమను బట్టి దేవుని ప్రేమించు చున్నామో లేదో తెలిసికో వచ్చునని యోహాను చెబుతాడు. దేవుని ప్రేమించి సహోదరులను ద్వేషించలేము. సహోదరుని ప్రేమించి దేవుని ద్వేషించలేము. విచారం యేమంటే మనలో అనేకులు సహోదర ప్రేమను కలిగియుండుటలేదు. అది అట్లుండరాదు.

మూడవదిగా క్రైస్తవుడు పవిత్రమైన పరిశుద్ధ జీవితమును కలిగి యుండునని యోహాను వ్రాసాడు. దేవుని యెడల ప్రేమ, ఆయన ఆజ్ఞలకు విధేయులగుట ఒక దానితో మరొకటి కలిసే యుండును. మరల ఒకటి చేసి రెండోది చేయకుండా యుండలేము. దేవుని వాక్యమునకు లోబడుట ద్వారా దేవుని యెడల ఉన్న నిజమైన ప్రేమ బయలు పరచబడును. యేసునందలి విశ్వాసము వలన మనము లోకమును జయించు చుందుమని యోహాను చెప్పాడు. సంక్షిప్తముగా, దేవుని వలన పుట్టినవాడు యేసే క్రీస్తని నమ్మును. క్రైస్తవుడు సహజముగా దేవుని ఆయన పిల్లలను ప్రేమించును. తత్ఫలితముగా పరిశుద్ధ జీవితమును జీవించును. అతడు ఈ లోకమును జయించాడు. గనుక దేవుని ఆజ్ఞలను గైకొనును. అది క్రీస్తునందలి విశ్వాసము వలన సాధ్యమాయెను.

లోకమును జయించినది నిజముగా మన విశ్వాసమే. నిజమైన విశ్వాసము క్రైస్తవుని జీవితంలో కనబడును. దేవునితో మన జీవితము యొక్క ఆది అంతము విశ్వాసమే. అది విధేయత చూపు విశ్వాసము. "యేసుక్రీస్తు నందుండువారికి సున్నతి పొందుట యందేమియు లేదు. పొందకపోవుట యందేమియు లేదు. గాని ప్రేమ వలన కార్యసాధకమగు

విశ్వాసమే ప్రయోజనము" అని పౌలు చెప్పాడు (గలతీ 5:6).

నీ విశ్వాసము ఎంత బలమైనది? నీ వేమి చెప్పినను, తలంచినను గాక నీవెట్లు జీవించుచున్నావో యనుదానిపై అది ఆధారపడును. దేవుని మూలముగా పుట్టినవాడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఎల్లవేళలా నమ్మును, పవిత్రమైన ప్రేమపూర్వక జీవితమును జీవించును. ఈ లక్షణములు లేనివాడు దేవుని మూలముగా పుట్టినవాడు కాదని యోహాను చెప్పుచున్నాడు. అట్టి వానికి పరలోక నిరీక్షణ లేదు. దేవుని మూలముగా పుట్టినవాని లక్షణములు నీ జీవితములో యుండునట్లు జాగ్రత్తపడుము.

\- జెర్రీబేట్స్

## క్రొత్త నిబంధన లేని రోజులలో క్రీస్తు సంఘము ఎట్లుండెను?

**(What was the Church like when they didn't have the New Testament?)**

మనము క్రొత్త నిబంధన సంఘమని తరుచు చెప్పుకొంటాము. లేదా మొదటి శతాబ్ధపు సంఘమని క్రీస్తు సంఘమును గూర్చి చెప్పుకొంటాము. కొరింధు సంఘములోని పాపములను కలిగియున్నామని గాని, గలతీయలో యున్న అబద్ధ బోధలను కలిగి యున్నామని గాని దాని ఉద్దేశ్యము కాదు. మొదటి శతాబ్ధపు సంఘాలు పరిపూర్ణమైనవని నేనను కొనడంలేదు.

మొదటి శతాబ్ధపు సంఘము వలె వేము న్నామని మనము చెప్పునప్పుడు గత రెండువేల సంవత్సములలోను దేవతార్చన, కేతోలిసిజమ్, డినామినేషన్ లిజమ్ మొ॥ అనేక సంగతులు క్రైస్తవ మతములో ప్రవేశించి దాని అసలు రూపు రేఖలను మార్చివేయుట జరిగినది. అది మొదటి శతాబ్ధములో యున్న క్రైస్తవ్యము కాదు. గనుక మొదటి శతాబ్ధములో క్రైస్తవులు సంఘములు ఎట్లున్నవో అట్లే నేడు మనమును ఉండుటకు ప్రయత్నము చేయుచున్నాము. ఇంకొక మాటలో క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుటకు నేటి క్రీస్తు సంఘమును కృషి చేయుచున్నది.

అయితే క్రీస్తు సంఘారంభ

దినాల్లో వారికి లిఖితపూర్వకంగా క్రొత్త నిబంధన లేదు. ఉదాహరణకు కొరింథులోని క్రీస్తు సంఘముకు పౌలు వ్రాసిన పత్రికలు ఉన్నాయి. మరల యితరులు వ్రాసిన పత్రికల యొక్క ప్రతులు వారి యొద్ద ఉండియుండ వచ్చును కూడ. గాని వారికి 27 పుస్తకములు గల క్రొత్త నిబంధన ఆనాడులేదు.

అధికారమంతయు క్రొత్త నిబంధన నుండియే కలుగు చున్నందున వారి యొక్క అధికారము ఎక్కడ నుండి వచ్చెను? సంఘముగా, క్రైస్తవులుగా వారే ఏమి చేయాలో ఎట్లు నిశ్చయించేవారు?

## అపొస్తలులు, ప్రవక్తలు

క్రీస్తు సంఘము యొక్క ఆరంభమునుండియు, క్రైస్తవులు యేసు ప్రభువు చిత్తమును తెలిసికొనవలెనంటే వారు అపొస్తలుల బోధకు కట్టుబడి యుండాలని ఎరుగుదురు (అపొ.కా. 2:42). అపొస్తలులు యేసు క్రీస్తుకు అధికార పూర్వక ప్రతినిధులు. వారు పరిశుద్ధాత్మవలన సర్వ సత్యములోనికి నడిపింపబడిరి (యోహాను 16:13). యేసు ప్రభువు వారికి చెప్పిన వన్నియు పరిశుద్ధాత్ముడు వారికి జ్ఞాపకము చేయుచుండెను (యోహాను 14:26). వారు క్రీస్తు మనస్సును కలిగియుండిరి (1 కొరింధి 2:16). గనుక మనము క్రొత్త నిబంధన సంఘముగా, క్రీస్తు సంఘముగా యున్నామన్నప్పుడు వారి వలెనే మనమును అపొస్తలుల బోధను అనుసరించుచున్నామని చెప్పుచున్నాము.

"మన మందరము విశ్వాస విషయములలోను, దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయములోను ఏకత్వము పొంది సంపూర్ణ పురుషులమగు వరకు అనగా క్రీస్తుకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత గలవారమగు వరకు ఆయన ఈలాగు నియమించెను. పరిశుద్ధులు సంపూర్ణు లగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్యధర్మము జరుగుటకును ఆయన కొందరిని అపొస్తలులుగాను, కొందరిని ప్రవక్తలుగాను, కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులుగాను, ఉపదేశకులుగాను నియమించెను" అని పౌలు చెప్పాడు (ఎఫెసీ 4:11-13). యిది చాల ప్రాముఖ్యమైన పట్టిక.

అద్భుతరీతిగా పరిశుద్ధాత్మతో నడిపించబడిన అపొస్తలులేగాక మరి కొందరు ప్రవక్తలు కూడ యుండిరి. వారిద్వారా కూడా దేవుడు మాట్లాడెను. అయితే ఈ అద్భుతవరములు నిలిచిపోవునని పౌలు కొరింథు సంఘమును హెచ్చరించెను. "ప్రేమ శాశ్వత కాలముండును. ప్రవచనములైనను నిరర్ధకములగును. భాషలైనను నిలిచిపోవును జ్ఞానమైనను నిరర్ధకమగును" అని అతడు హెచ్చరించాడు (1 కొరింథీ 13:8). దేవుని యొక్క పరిపూర్ణ చిత్తము అపొస్తలుల ద్వారా బయలు పరచబడి గ్రంథస్థము చేయబడగానే ఈ అద్భుత వరములన్నియు గతించిపోయెను. క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలో సంపూర్ణమైన దేవుని చిత్తము నేడు మనకు బయలు పరచబడి యున్నది. అయితే ఈ అద్భుత వరములున్నంత కాలము మొదటి శతాబ్ధపు క్రీస్తు సంఘము ప్రవక్తలు, అపొస్తలుల ద్వారా దేవుని చిత్తమును తెలిసికొనగలిగిరి.

**సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు**

మొదటి శతాబ్ధపు సంఘము ఏమి చేయాలో చేయకూడదో బోధించుటకు కేవలము అపొస్తలులు ప్రవక్తలే గాక యితరులు కూడ యుండిరి. అపొస్తలులు తిమోతి, తీతు లాంటి వారికి తర్ఫీతునిచ్చిరి. ఈ సువార్తికులు వలు స్థానిక సంఘములకు వెళ్ళి అపొస్తలులు వారికేమి బోధించారో దానిని సంఘములకు ఉపదేశించేవారు.

ఈ సువార్తికులు సంఘమునకు ఉపదేశించు, ఖండించుచు గద్దించుచు దీర్ఘ శాంతముతో వారి మధ్య పని చేయాలి (2 తిమోతి 4:2).

వారు ప్రతి స్థానిక సంఘములోను పెద్దలను ఏర్పాటు చేయాలి (తీతు 1:5).

వారు అపొస్తలుల యొద్ద వినిన సత్యమును ఇతరులకు బోధించుటకు సామర్ధ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపవలెను (2 తిమోతి 2:2).

అపొస్తలుల బోధను నేర్చుకొని యితరులకు దానిని అందజేయుటకు కృషి చేయుచున్న నేటి సువార్తికులు మొదటి శతాబ్ధపు సువార్తికుల అడుగు జాడలలో నడుచుకొనుచున్నారు. మన మధ్యను ఇప్పుడు అపొస్తలు లెవరు

లేరుగాని, క్రొత్త నిబంధన పుటలలో వారి బోధలిఖితమై మనకున్నది. క్రీస్తుయొక్క వర్తమానమును యితరులకు అందజేయుటకు నేటికిని మనకు సువార్తికులు అవసరమై యున్నారు.

గనుక మొదటి శతాబ్ధపు క్రీస్తు సంఘము అపొస్తలుల బోధలు ఉపదేశించిన సువార్తికులను, వాక్యములో పరిపక్వము చెందిన పెద్దలను, ఉపదేశకులను కలిగి యుండెను. పెద్దలు స్థానిక సంఘంపై పర్యవేక్షణ కలిగి, వారి ఆత్మీయ క్షేమము కొరకు శ్రమించువారై యుండిరి. స్థానిక సంఘస్థులు పెద్దల యొక్క మాట చొప్పున నడువ బద్ధులైయుండిరి. హెబ్రీ పత్రిక లేఖకు డిట్లనుచున్నాడు. "మీపైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పజెప్పవలసిన వారి వలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడి యుండుడి" (హెబ్రీ 13 :17).

పెద్దలు, సువార్తికులు నేటికి కూడ సంఘములో ప్రముఖ పాత్రను వహించుచున్నారు. క్రొత్త నిబంధన ఇంకా తయారగుచున్న దినములలో వారి పాత్ర మరింత అధికముగా యుండెను. ఇప్పుడు క్రొత్త నిబంధన మనకీయబడియున్నది గనుక, సంఘాధిపత్యము విషయములలో దాని యొక్క ఉపదేశమును ఎవరు ఉల్లంఘించకూడదు.

## పాత నిబంధన లేఖనములు

తదుపరి, మొదటి శతాబ్ధపు సంఘముకు బొత్తిగా లేఖనములు లేకుండా పోలేదు. వారి యొద్ద పాత నిబంధన ఇంకా ఉండియుండెను. వారి సమాజములలో పాత నిబంధన లేఖనములను బహిరంగముగా చదువుచు యుండిరి (1 తిమోతి 4:13). వారు దాని నుండి బోధించేవారు. యేసుక్రీస్తు వారి ప్రధాన యాజకుడని, వారి పాప పరిహారయాగమని, సంఘము నూతన ఇశ్రాయేలని, అబ్రాహాము, నోవహు, మోషే, దానియేలుల వంటి వారి విశ్వాసమును వారు అనుకరించాలని పాత నిబంధన నుండి వారికి బోధించేవారు (హెబ్రీ 11 అధ్యా).

"ఏలయనగా ఓర్పువలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి" యని పౌలు బోధించెను (రోమా 15:4).

## క్రొత్త నిబంధన లేఖనములు

చివరిగా, క్రీస్తు సంఘము క్రొత్త నిబంధన లేఖనములను కలిగి యుండెను. క్రొత్త నిబంధన అంతా సమకూర్చబడి వారికి అప్పుడు లేదు గాని ఒకటి రెండు పత్రికలు గాని పుస్తకములుగాని వారికి లభించియుంటే అది ఒక గొప్ప ఆశీర్వాదముగా పరిగణింపబడేది. ఉదా: ఎఫెసులోని సంఘము పౌలు వారికి వ్రాసిన పత్రిక అందుకొనగానే, వారు దాని ప్రతులను తయారుచేసి యితర స్థానిక సంఘములకు పంపుటయే గాక, ఆ పత్రికను వారును పదే పదే చదివించుకొనేవారు. దానిలోని ప్రతి మాటను ఆస్వాదించేవారు.

అపో. పేతురు కూడ పౌలు వ్రాసిన పత్రికలను అందరు చదువవలెనని హెచ్చరించేవాడు. "మరియు మన ప్రభువు యొక్క దీర్ఘ శాంతము రక్షణార్థమైనదని యెంచుకొనుడి. ఆలాగుమన ప్రియ సహోదరుడైన పౌలు కూడ తనకు అనుగ్రహింపబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాయున్నాడు. వీటిని గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు. అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి. వీటిని విద్యావిహీనులును, అస్థిరులైన వారును తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు తమ స్వకీయ నాశనమునకు అపార్థము చేయుచున్నారు" (2 పేతురు 3:15-16).

నేడు 27 పుస్తకములు కలిగిన క్రొత్త నిబంధన మనము కలిగియున్నాము. ఎంతో దీవించబడి యున్నాము. అది విరివిగా మనకు లభ్యమగుచున్నది. యేసు క్రీస్తుకు చెందిన సంఘము వలె మనము ఉండకోరుచున్న యెడల, పెంతెకోస్తు తరువాత మొదటి క్రైస్తవులేమి చేసారో దానినే మనమును చేయాలి. అపొస్తలుల బోధయందు నిలిచి యుండాలి.

- వెస్‌మెక్ ఆడమ్స్

## సంక్షిప్త వార్తలు

2016 మే నెల మొదటి మూడు దినములలోను కాకినాడకు చేరువరలో యున్న వెంకటకృష్ణరాయపురం లాకుల వద్ద నున్న క్రీస్తు సంఘము సువార్త కూటములను ప్రతి రాత్రి ఘనముగా నిర్వహించిరి. మొదటి రోజున జాషువా గూటం గారు, క్రీస్తును గూర్చి, పాపమును గూర్చి, పాపవిముక్తిని గూర్చి క్రీస్తు సంఘమును గూర్చి చక్కగా బోధించిరి. తదుపరి రెండు రాత్రులందును సోదరులు ఎ. గోపాలకృష్ణగారు దేవుని వాక్య పరిచర్యను గావించిరి. ఆ కూటముల ఫలితముగా ఇద్దరు యువకులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వెంకటకృష్ణరాయపురంలోను పరిసర ప్రాంతములలోను సోదరులు బొండపాటి రవీంద్రనాథ్‌గారును, ఆయన కుమారులు రాజారత్నంగారును గొప్ప పరిచర్య చేయుచున్నారు.

2016 మే నెల 1 నుండి 5వ తేదీ వరకు నిడసనమెట్టలోని క్రీస్తుసంఘము సోదరులు ప్రేమ్ సుధీర్‌గారి నాయకత్వమున యేసుక్రీస్తు రక్షణ సువార్త సభల నేర్పాటు చేసి, ఘనముగా నిర్వహించిరి. ప్రతిరాత్రి వందలాది గ్రామస్తులు హాజరై సంఘము ఒక్కటే, ప్రభువు ఒక్కడే, బాప్తిస్మము ఒక్కటే అను పలు అంశములపై గొప్ప సత్యములు బోధింపబడగా ఆశ్చర్యచకితులై ఆలకించిరి. పరిసర గ్రామములు పట్టణములలోనుండి అనేక సువార్తికులు వచ్చి గొప్ప సహాయసహకారముల నందించి సహవాసములోని మాధుర్యమును ఒకరితో ఒకరు పంచుకొనిరి. సోదరులు యమ్. జయరాజు, యమ్. సామ్యూల్ రాజు, జాషువా గూటం, యమ్. సూర్యారావు, టి. జ్ఞాన సుధీరుగారు తదితర సోదరులును వాక్యపరిచర్య చేసిరి. ఈ అయిదు రోజులు నిడసనమెట్టలో గొప్ప పండుగ వాతావరణము ఏర్పడెను. వచ్చినవారందరికి అన్ని రోజులు స్థానిక సంఘము భోజన పానీయములనేర్పాటు చేసిరి. నిడసనమెట్టలో సోదరులు ప్రేమ్ సుధీర్‌గారు బలమైన పని చేయుచు స్థానిక సంఘమును ఆత్మీయముగను, సంఖ్యలోను అభివృద్ధి చేయుచున్నారు.

2016 మే నెల 9,10,11 తేదీలలో జగన్నాథగిరిలో యేసుక్రీస్తు రక్షణ సువార్త సభలు ఏర్పాటు చేయబడెను. పులగల విలియం కేరీ దంపతుల ఆధ్వర్యములో ఈ సభలు ఘనముగా నిర్వహించబడెను. గ్రామమునకు సెంటరులో

యున్న విశాల ప్రాంగణములో విద్యుద్దీపములతో చక్కగా అలంకరించబడిన ప్రసంగ వేదిక నుండి సోదరులు పులగల విలియం కేరీగారు, యమ్. సామ్యూల్‌రాజుగారు, జాషువా గూటంగారు, టి. ప్రసన్న విజయకుమార్‌గారు, టి. జ్ఞాన సుధీర్‌గారు,. ఎ. కృపాదానంగార్లు దేవుని సత్యవాక్య సందేశములను ఘనముగా ప్రకటించిరి. ప్రతిరాత్రి చల్లటి వాతావరణములో ప్రజలు అసంఖ్యాకులుగా హాజరై దేవుని వాక్యము నాలకించిరి. స్థానిక సంఘము, విలియమ్ కేరీ దంపతులు హాజరైన వారందరికీ భోజన సదుపాయములు కల్పించిరి. క్రీస్తు నామము బహుగా ఘనపరచబడెను.

"యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అను 270 పేజీలు 51 ప్రసంగములు గల పుస్తకము పోస్టేజీతో సహా 60/- రూ.లకు సత్యవాణి ఆఫీసులో లభ్యమగుచున్నది. వలయువారు సత్యవాణికి ఎమ్.ఓ. చేసి పొందవచ్చును అని జాషువా గూటంగారు తెలియజేయుచున్నారు. సువార్తికులందరు ఈ పుస్తకము వలన గొప్ప మేలుపొందుచున్నట్లు తెలియజేయుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.